# కథ షార్ట్ ఫిలిం

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ఇంటర్మీడియేట్ చదివే మా పెద్దాడు చిన్నిగాడికి (అసలుపేరు చిన్నారావు) సినిమాలంటే వల్లమాలిన అభిమానం. ఏ సినిమా వచ్చినా చూసి, అందులోని ప్లస్సులు మైనస్సులని వర్గీకరించి రేటింగులతో తన బ్లాగులో, ఫేస్ బుక్కులో ఎడా పెడా సమీక్షలు రాసిపారేస్తుంటాడు. నిజం చెప్పాలంటే సినిమాని అన్ని కోణాల్లో చూడొచ్చని వాడి సమీక్షలు చదివాకే తెలిసింది. సినిమా అనేది మనకు వినోదం అయినా దానికి రూపమివ్వడానికి తెరవెనక.. ముందు ఎంతమంది శ్రమిస్తారో వాడు చెబుతుంటే ఆశ్చర్యం కలిగేది. ఛాన్సు దొరికితే ఆ విషయాలన్నీ ఒక రకమైన తాదాత్మ్యతతో చెప్పుకుపోతుంటాడు. వాడికీ పిచ్చి ఇప్పటిది కాదు. ఆరో తరగతి చదువుతున్నప్పుడే సినిమా తన ఆరోప్రాణంకూడా కాదు, పంచప్రాణాలని చెప్పేవాడు. మొదట్లో వాడిని చదువు మీద దృష్టిపెట్టమని కసురుకున్నాను. కానీ వాడిలో ఏ మార్పూలేదు. ఒకసారి ఆఫీసు లంచ్ టైంలో మా అబ్బాయి గురించి నా ఫ్రెండ్ దగ్గర మొరపెట్టుకున్నాను.

వాడు కన్యాశుల్కంలోని గిరీశంలా నా వైపు ఒక లుక్కు లుక్కి నేనిప్పించిన సిగరెట్టు దమ్ము గట్టిగా లోపలికి లాగి బయటకొదిలి. "ఇప్పటి చాలామంది పిల్లల కన్నా నీ పిల్లాడు నయం. వాళ్ళు గొర్రెల్లా తల్లిదండ్రులు చెప్పినట్టు తమ జీవితాలని బందెల దొడ్డిలాంటి కార్పొరేట్ కాలేజీలకి కట్టేసుకుంటున్నారు. వాళ్ళలో సృజనాత్మకత ఎక్కడ ఏడుస్తుంది? అదే మీ వాడయితే తనకి నచ్చిన రంగమేదో చెప్పేశాడు కాబట్టి నువ్వు ప్రోత్సహిస్తే దూసుకుపోతాడు. ప్యాషన్ (passion) వున్న వ్యక్తి ఎప్పటికైనా తాననుకున్నది సాధించి తీరుతాడు." అన్నాడు.

"అదికాదురా! ఫిలిం ఇండస్ట్రీ అంటే గాంబ్లింగ్. అక్కడ వీడు నిలదొక్కుకోగలడంటావా? తల్చుకుంటే బెంగగా వుందిరా! రేపు వీడి జీవితం తెగిన గాలిపటం అవుతుందేమోనని భయంగా వుంది" ముఖంలో విచారంతో కూడిన భయాన్ని కనబరుస్తూ అనుమానం వ్యక్తం చేశా.

"అలానే వుండాల్రా! నెల జీతాలతో మనమెంత ఇబ్బంది పడుతున్నామో తెలుసుగా! మనం చేసే తప్పేంటంటే మనలాంటి మరో తరాన్ని తయారుచేయడం. వాళ్ళ బ్రతుకేదో వాళ్ళని బ్రతకనిస్తే రేపు మన తరంలో ఒక వజ్రమన్నా తళుక్కుమంటుంది. లేకపోతే అత్తెసరు జీ(వి)తాలు షరా మామూలే!" అన్నాడు అప్పనంగా వచ్చిన సిగరెట్టు పీల్చడంలోని అనుభూతిని ఆస్వాదిస్తూ అరమోడ్పు కనులతో.

వినగా వినగా అదే నిజమనిపించింది.

ఇంటికొచ్చి ఎప్పట్లా వాడిని చదవమని తిట్టకుండా.. సినిమాల విశేషాలడిగాను. నేనలా అడిగేసరికి వాడికి అనుమానమొచ్చింది, పరీక్షిస్తున్నానేమోనని. కానీ మరీ మరీ అడిగేసరికి వాడిలోని సినీ వ్యక్తి బయటకొచ్చాడు. ఒకటి రెండు కాదు అశేషమైన సినిమా విశేషాలు విపులంగా విశదీకరించాడు.

వేసవి సెలవుల్లో ఓ ప్రముఖ స్టూడియోవారు నిర్వహించిన ఎడిటింగ్, డైరెక్షన్ విభాగంలో షార్ట్ కోర్సులో చేర్పించాను. వాడి ఆనందం అంతా ఇంతాకాదు. ఎంతో దూరమున్న ఆ స్టూడియోకి ఒక్కరోజు మానకుండా ప్రతిరోజు  తెల్లవారుఝామునే లేచి బస్సుల్లోపడి వెళ్ళొచ్చేవాడు. నాకు తెలిసి పబ్లిక్ ఎగ్జామ్స్‌కి కూడా వాడంత శ్రమించలేదు. అక్కడ DSLR కెమెరా గురించి పూర్తిగా వివరించారట. క్లాసు నుండి రాగానే  ఆ రోజు జరిగినదంతా పూస గుచ్చినట్టు చెప్పేవాడు. ఇష్టమైన రంగంలో వుంటే ఎవరైనా ప్రతీక్షణాన్నీ ఎలా అనుభూతి చెందుతారో స్పష్టంగా చూడగలిగాను.

ఆ ఆసక్తి.. సినిమారంగం పట్ల అనురక్తి చూశాక వాడికి పెన్నులూ... పుస్తకాలే కాకుండా DSLR కెమెరా ఆన్‌లైన్లో EMIల సహకారంతో కొని బహుమతిగా ఇచ్చాను. ఇహ చూడాలి వాడి సంతోషం. నాకు అందులోని స్విచ్చులు, సెట్టింగుల గురించి టకటక చెప్పేశాడు. మా ఇంట్లోని వాళ్ళని రకరకాల యాంగిల్స్‌లో ఫొటోలు తీసి కంప్యూటర్‌లో చూపించాడు.

ఒక్కోసారి ఆ సినిమా వ్యామోహం చూసి వాడికి మతి చలిస్తుందేమోనని భయమేసేది. అగ్నికి ఆజ్యం పోస్తున్నట్టు వాడిని ప్రోత్సహిస్తునానేమో అన్న సందేహం కూడా కలిగేది. కాని ఏం చేస్తాం విధి వాడి రాత ఎలా రాసిందో!

"నాన్నా.. నువ్వు ఎప్పుడైనా షార్ట్ ఫిలిం చూశావా?" అడిగాడు.

"విన్నాను కానీ.. చూడలేదు నాన్నా!"

"అయితే రండి మీకు చూపిస్తాను" అని యూ ట్యూబ్‌లో రెండు మూడు షార్ట్ ఫిలింలు చూపించాడు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఎక్కడో వున్న సినిమా హాలుకెళ్ళి టిక్కెట్ల కోసం అనేక ఇక్కట్లు పడుతూ లైన్లో నుంచుని.. తొక్కిసలాటలు తోపులాటల పర్వం అయ్యాక ఆ టికెట్ ముక్కలు తీసుకుని




హాల్లోకి పరిగెట్టి రెండున్నర గంటల సినిమా చూసి ఇంటికొచ్చేసరికి ఒళ్ళు పులిసిపోయేది. అలాంటిది ఇప్పటి తరం ఐదు నుండి పదిహేను నిమిషాల్లో సుత్తి లేకుండా సూటిగా తాము చెప్పదల్చుకుంది సృజనాత్మకతతో షార్ట్ ఫిల్మ్ రూపంలో చెప్పడం అద్భుతం.

"చాలా బాగున్నాయిరా! మంచి స్ఫూర్తిదాయకంగా వున్నాయి" మెచ్చుకోలుగా అన్నాను.

కొన్నాళ్ళకి వాడు తన స్నేహితులతో కలిసి రెండు షార్ట్ ఫిలింలు తీసి యూ ట్యూబ్‌లో పెట్టాడు. అవి కొత్త తరహాలో వుండి బోలెడన్ని లైకులు సొంతం చేసుకున్నాయి. వాడి ఎదుగుదల నాకు స్పష్టమవుతోంది. కానీ ఈ రంగం వాడికి ఎంతవరకూ అండగా వుంటుందో అన్న బెంగ మనసులో గూడుకట్టుకుని నన్ను అప్పుడప్పుడూ బూచిలా భయపెడుతోంది.

---

ఒకసారి నేను ఆఫీసు పనిమీద పది రోజులపాటు బెంగుళూరు వెళ్ళాల్సి వచ్చింది.

ఆ పని పూర్తయ్యాక ఇంటికొచ్చి ఆఫీసుకి వెళ్ళాను.



PREVIOUS NEXT

# కథ షార్ట్ ఫిలిం

మూర్తి నా కొలీగ్. లంచ్ టైంలో నన్ను కలిసి "ఏంట్రా మీ వాడు నీ మీద షార్ట్ ఫిలిం తీసి పెట్టాడు? ఎంత అసహ్యంగా వుందో నేను రెండు నిమిషాలు చూసి ఇహ నిన్నలా చూళ్ళేక ఆపేశాను" అన్నాడు ముఖం అదోలా పెట్టి.

నాకు మనసులో భయమేసింది. 'వీడేం తీశాడు? అసలు నా గురించి అసహ్యంగా ఏం తీసుంటాడు? అయినా అందుకే మితిమీరిన స్వేచ్ఛ కూడదంటారు. వెంటనే వెళ్ళి చూసేయాలి. లేకపోతే కొంపలు మునిగిపోతాయి' అనుకుని హాఫ్‌డే లీవ్ తీసుకుని ఇంటికెళ్ళాను.

పీసీ ఆన్ చేసి యూ ట్యూబ్‌లో మావాడు తీసిన షార్ట్ ఫిలిం ప్లే క్లిక్ చేశాను.

'మా నాన్న గారు..!' నా ఫొటోతో టైటిల్ వేశాడు.

ఆ షార్ట్ ఫిలింలో పాలుపంచుకున్న మిత్రుల పేర్లు వినసొంపైన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌తో ఆహ్లాదంగా మారుతున్నాయి. ముందుగా ఇల్లూడుస్తూ... అంట్లు తోముతూ.. బట్టలుతుకుతూ.. అన్నం వండుతూ.. నాకు సిగ్గుతో నర నరం మెలి తిరిగిపోతోంది.

'వీడేంటి ఇలా చేశాడు? నేనా పనులు చేస్తుంటే వాడు సరదాగా ఫొటోలు తీస్తున్నాడనుకున్నాను కానీ ఇలా నడిరోడ్డుమీద పెడతాడనుకోలేదు. మగాళ్ళు ఇంటిపనులు చేస్తుంటారు కానీ బయటపడడం నామోషీగా భావిస్తారు. అలాంటిది? నన్ను?'

"రాజీ! పెద్దాడేడి?" కాస్త తీవ్రస్థాయిలో మా ఆవిణ్ణి అడిగాను.

"ఎగ్జామ్స్ కదండీ. చదువుకోడానికి ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాడు. అయినా అలా కోపంగా వున్నారేమిటీ? ఏం జరిగింది?" అంది.

"ఏం లేదులే" గొణిగి అసంకల్పితంగా ఇంకా నన్నెంత 'బయటపెట్టాడో' అని ఫిల్మ్ చూడసాగాను.

"ఇప్పుడు మా నాన్నగారు చేసిన పనులన్నీ మా అమ్మకి ఒంట్లో బాగోలేక లేవలేకపోయినప్పుడు చేశాడు. అంతేకాదు మామూలురోజుల్లో కూడా అమ్మ ఒక్కతే ఇంటి పని చేయలేక సతమతమయిపోతుంటే తనకెందుకన్నట్టు ఓ మూల పేపరు చదువుకుంటూనో, టీవీలో వార్తలు చూస్తూనో గడపకుండా అమ్మకి చేతనైన సాయం చేస్తాడు. మమ్మల్ని స్కూలుకి సిద్ధం చేస్తాడు. దగ్గరుండి ఓపిగ్గా చదివిస్తాడు. ఎక్కడి వస్తువులు అక్కడ పొందిగ్గా అమర్చబడి శుభ్రంగా వుండే మా ఇంట్లోకి అడుగెడుతుంటే చాలా ఆహ్లాదంగా వుంటుంది. మగాడు తాను మగాడినన్న ఈగోని వదిలేస్తే మా ఇల్లంత చక్కగా.. ప్రశాంతంగా వుంటుంది ఏ ఇల్లయినా! నన్నూ, మా తమ్ముణ్ణీ ఎన్నడూ తిట్టిందీ లేదు, కొట్టిందీ లేదు. కేవలం బాధ్యతలు తెలియచెప్పడం తప్ప. మా వరకూ మాకు మా నాన్నగారు రోల్ మోడల్ ... గైడ్ ... ఇలాంటి నాన్న మాకుండడం మా అదృష్టం..." అంటూ మా అబ్బాయి వాయిస్ ఓవర్ వినిపించింది.

నా కళ్ళలో నీళ్ళు. వాడు తీసినదానిలో తప్పేం లేదు. ఇంటి బాధ్యత అంటే ఏ ఒక్కరిదో కాదు. అందుకు భార్యాభర్తలిద్దరూ బాధ్యత వహించాలి. అప్పుడే ఆ ఇల్లు సంపూర్ణంగా వికసిస్తుంది. తక్కువ సమయంలోనే మంచి విషయాన్ని హత్తుకునేలా చెప్పగలిగాడు. ఇహ వాడి గురించి నా బెంగ తీరింది. వాడి ప్యాషన్ (passion) ఆ ఫిల్మ్‌లో కళ్ళకు కట్టింది. ఇహ వాడి భవిష్యత్తు గురించి చింతంటారా? ఎవరి నుదుటన భగవంతుడు ఏం రాశాడో తెలియదు కదా!

సెల్ మోగింది. నేను చూశాను. మా జనరల్ మేనేజరుది.

"సార్! గుడ్ ఈవెనింగ్"

"ఇప్పుడే మీ అబ్బాయి తీసిన షార్ట్ ఫిలిం చూశాను. చాలా బాగుందయ్యా! చిన్నతనంలోనే అంత చక్కగా తీశాడంటే, రేపు పెద్దయ్యాక మంచి డైరెక్టరు అవుతాడు. నాకెందుకో మీ వాడిని మనస్ఫూర్తిగా అభినందించాలనిపిస్తోంది. అందుచేత రేపు సాయంత్రం కాలేజీ అవంగానే మనాఫీసుకి వచ్చేయమను" అన్నాడు.

నాకెందుకో వాడి కష్టానికి అవార్డ్ అందుకుంటున్నాడనిపించింది.


"థాంక్యూ సార్"

-----

మరుసటి రోజు ఆఫీసులో మా వాడికి ఫ్లవర్ బొకే, మంచి గిఫ్ట్ ఇచ్చి మా జనరల్ మేనేజరుగారు "వీళ్ళబ్బాయి తీసిన షార్ట్ ఫిలిం నాకు ఎంతగా నచ్చిందంటే ఇదిగో ఇలా అభినందన సభ పెట్టేదాకా...మనలో మనమాట. నేను ఇక్కడ మేనేజరునే కాని ఇంట్లో మా ఆవిడకి సహాయకుడిని. ఈరోజు వీడు నాలాంటివాళ్ళని మీ ముందు బయటపడేలా చేశాడు. మన ఇంటి కోసం శ్రమించడం తప్పెలా అవుతుంది? నామోషి ఎందుకవుతుంది? మనలో చాలామంది పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు ఇంకా ఏవేవో అవడానికి పరుగులు తీస్తుంటారు. కాదు మనమే పరుగుపెట్టిస్తుంటాం. దాంతో జీవితాన్ని అందంగా జీవించకుండా యాంత్రికం చేసేసుకుంటున్నారు. పిల్లల్లో వున్న సృజనాత్మకత చచ్చిపోతోంది. ఫొటోగ్రఫీ ... లిటరేచర్ లాంటివి హాబీలుగానే చెప్పుకుంటారు. ఎందుకుంటే అవి బ్రతుకు తెరువునివ్వవని భయం. అందువల్ల స్వతహాగా అలవడ్డ కళని కల చేసుకుంటున్నారు. నాకు తెలిసి ఒక్కో పిల్లాడిలో ఒక్కో కళ నిద్రాణమై వుంటుంది. దాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించి తట్టిలేపాలి. అప్పుడే సాంస్కృతిక కళారంగాలు శోభిస్తాయి. నా వరకు నాకు సాహిత్యమంటే ప్రాణం. రాయడం చాలా ఇష్టం. కానీ ఆఫీసు పని బిజీలో దాన్నెప్పుడో వదిలేశాను. ఎపుడన్నా ఒక మంచి కథ చదివితే 'అయ్యో నేను ఇలాంటిది రాయలేకపోయానే' అనే బాధ గుండెల్ని చుట్టేస్తుంది. తపన వున్న పిల్లలుండడం ఒక ఎత్తయితే.. ప్రోత్సహించే ఇలాంటి తండ్రి వుండడం మరో ఎత్తు. ఫిల్మ్‌లో చెప్పినట్టు నిజంగా మీ నాన్నగారు మంచిమనసున్న వాడయ్యా" అంటూ సుదీర్ఘంగా మాట్లాడి, మా పెద్దాడి భుజం మీద చెయ్యేసి మెల్లగా తట్టి నవ్వాడు.

"సారీరా! ఫిల్మ్ మొత్తం చూడకుండా నోటికొచ్చినట్టు కామెంట్ చేశాను. ఇదిగో పశ్చాత్తాపంగా ఈ చక్కటి గిఫ్ట్ మీ వాడికి" అని ఒక సీల్డ్ కవర్ అందించాడు మూర్తి.

తేలికపడ్డ మనసుతో మావాడిని పొదువుకున్నట్టుగా దగ్గరికి చేర్చుకుని ఇంటికి బయల్దేరాను. ■






PREVIOUS NEXT